# మిడ్‌నైట్ ఏ ఛానెల్

**ఆ**ఫీసులో తనంటే అందరికీ సదభిప్రాయమే ఉందన్న విషయం రామకృష్ణకు తెలుసు. సహద్యోగుల్లో మగవాళ్లే కాదు ఆడవాళ్లు కూడా అప్పుడప్పుడూ తనతో సరదాగా మాట్లాడుతుంటారు. ఈమధ్య అందరికన్నా ఎక్కువగా లలిత తనతో కాస్త చనువుగా మాట్లాడడం రామకృష్ణకు పరిపరి విధాల ఆలోచించుకునేలా చేస్తోంది.

అతడు ఆ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆఫీసులో క్లర్క్‌గా అడుగుపెట్టి ఆరునెలలే అయింది. అప్పటికే లలితకు ఆ ఆఫీసులో మూడేళ్ల ఎక్స్‌పీరియన్స్. ఆమె మొదటి మూడు నెలలలో తనతో అంత క్లోజ్‌గా మాట్లాడలేదు. మరి ఇప్పుడు ఎందుకనో...?!

ఆరోజు ఆఫీసులో అడుగుపెట్టడంతోనే లలిత అతడి దగ్గరగా వచ్చింది. ''ఈరోజు నాకు గుడ్ విషస్ చెప్పరూ?'' అంది.

అతడు కాసింత నవ్వు ముఖంతో, ప్రశ్నార్థకంగా చూస్తూ ''విశేషమేమిటో'' అన్నాడు.

''విశేషమంటే... ఈరోజు నా పుట్టిన రోజు మరి''

అతడు అప్రయత్నంగానే చెయ్యి ముందుకు చాచాడు. ఆమె చేతిని కలుపుతుందని మాత్రం అనుకోలేదు 'విష్ యూ వెరీ వెరీ హేపీ బర్త్‌డే' ఆమె చెయ్యి కలిపింది. అతడిని ఆ స్పర్శ మరెక్కడికో తీసుకెళ్లింది. స్పర్శా సుఖానందపు పారవశ్యం తనువంతా సోకి ఝల్లుమనిపించింది. స్త్రీ స్పర్శలో ఇంతటి స్పందన ఉందా? అనిపించింది అతనికి.

ఆమె మాత్రం అతడి ఫీలింగ్స్ పట్టించుకోనట్టు ''ఆఫీసులో మరెవ్వరికీ విషయం చెప్పలేదు. మీకే... మీకే తెలియజేస్తున్నాను'' అంది.

అదిగో... ఆ ప్రత్యేకత తనకు ఈ మధ్య అనుమానపు బీజాలు నాటుకునేలా చేస్తోంది. లలిత తనకు మాత్రమే ప్రత్యేకంగా చూస్తుంది ఎందుకని.

''ఈరోజు సాయంత్రం నేను మీకు చిన్న పార్టీ ఇవ్వబోతున్నాను కామత్ హోటల్ దగ్గరికి వస్తారు కదూ?''

తనేమయినా ప్రవరుని శిష్యుడా? లేక ఋష్య శృంగునికి స్నేహితుడా? తన ఉద్దేశ్యం ఈ ప్రపంచంలోని ఏ మగాడయినా ఆడదాని ఆహ్వానానికి పులకరించి పలవరించి పరుగెత్తవలసిందే- దానికి నో ఎక్సెప్షన్.

''మీరు పిలిచాక రాకుండా ఉంటానా?'' అని నవ్వి, ఆ నవ్వుని మనోహరంగా మార్చి ఆ తర్వాత అడిగాడు ''ఎన్నిటికి''

''ఐదింటికి''

ఎవరో వస్తుండటంతో, వారిద్దరూ దూరంగా జరిగి విడిపోయారు.

ఆ తర్వాత అతడికిక ఫైల్స్ మీద ఏకాగ్రత కుదరనే లేదు. ఎప్పుడు ఐదవుతుందా ఆఫీసు నుండి వెళ్లి కామత్‌లో లలిత ముందు కూర్చుందామా అని మనసు తపన పడసాగింది. క్షణాలు.. గంటల్లా గడవడమంటే ఏమిటో అతడికి అనుభవంలోనికొచ్చింది. గంటలయినా గడవక ఆగవు కదా?

సరిగ్గా ఐదింటికి లలిత ముందుగా ఆఫీసులో నుండి వెళ్లిపోయింది. ఐదు నిముషాలు ఆలస్యంగా అతడు బయల్దేరాడు. కామత్ చేరుకునేసరికి మరో అయిదు నిమిషాలు.

హోటల్ లోపల ఓ టేబుల్ ముందు కూర్చుని ఎదురు చూస్తూ కనిపించింది లలిత. అతడు వెళ్లి ఆమె ఎదురుగా కూర్చున్నాడు.

ఆమె టేబుల్ మీద రెండు మోచేతులూ ఆన్చి అర చేతుల్లో ముఖాన్ని ఉంచుకుంది ''చెప్పండి ఏం తీసుకుంటారు?''

అతడికి మరేదో అడగాలనిపించింది. కాని అంత చనువు లేదు.

అందులోనూ అడిగే సమయమూ కాదు. అయితే అలా అడిగే అవకాశం అతి త్వరలోనే రాగలదని అతడి మనసు చెపుతోంది. అతడు చెప్పాడు ''బాసుంది''

ఆమె తనకూ అదే తెప్పించుకుంది.

కొద్దిసేపటి తర్వాత ఆమె మాటల మధ్య చెప్పింది. ''రామకృష్ణగారూ! నాకు ముగ్గురు అక్కయ్యలు., ముగ్గురి మధ్యా రెండేసి సంవత్సరాలు తేడా ఉంది. కాని మా అక్కయ్య లెవ్వరికీ ఇంకా పెళ్లి కాలేదు''

అతడు ఆమె వైపు జాలిగా చూసాడు. ఆమె తనతో చనువుగా మసలుకోవడానికి కారణమేమిటో లీలగా అర్థం కాసాగింది.

అవకాశాన్ని ఉపయోగించుకోవాలనే అతడు అనుకున్నాడు కాని ఆమె కోరుకున్న విధంగా కాదు.

☆☆☆

సంధ్య చీకట్లు ముసురుకుంటున్నాయి.


పార్క్‌లో పొదల చాటు నుండి వారిద్దరూ పైకి లేచారు. పొదల చాటు కూర్చోవడం మరెవరి కంటా పడకూడదనే గానీ, చిలిపి చేష్టలతో తనువులో గిలిగింతలు కలిగించడానికి మాత్రం కాదు. అయితే అలా అని అతడు చేతులు ముడుచుకుని కూర్చోలేదు. అప్పుడప్పుడూ ఆమె శరీరానికి తాకించి స్పర్శా సుఖానందాన్ని పొందుతూనే ఉన్నాడు.

లలితతో మాటలు అప్పుడప్పుడూ కలిగే స్పర్శా సుఖానందం హాయిగానే ఉంది గానీ, 'అసలు పని' జరిగిపోతే తృప్తిగా ఉంటుంది కాని.. కాని ఆ అవకాశమే రావడం లేదు.

''ఇంటికేనా లలితా?'' అతడు అడిగాడు.

''అవును''

ఆమె వెళ్లాల్సింది తన రూమ్ మీదుగానే! అతడు ఆమె పక్కనే నడుస్తుంటే ఆమె గొణిగినట్టుగా అంది ''మనిద్దరం ఇలా పక్కపక్కనే నడుస్తుంటే ఎవరయినా చూస్తారేమో''




- కోపల్లి ఈశ్వర్

''అంటే దారిన వెళ్లే వారందరినీ కళ్లు మూసుకోమంటావా!'' అన్నాడు అతడు నవ్వుతూ.

''దారిన వెళ్లే వారి గురించి మాట్లాడటం లేదు. మన పరిచయస్తుల గురించి మాట్లాడుతున్నాను'' ఆమె అతడి కడుపులో మోచేత్తో పొడిచింది.

''అయితే మెయిన్ రోడ్‌లో వెళ్లడం ఎందుకు? ఇలా సందులు, గొందులు పడదాం. ఈ ఇరుకు సందుల్లో తెలిసిన వారెవరూ కనిపించరనుకుంటా.''

ఆమె అంగీకారంగా తలాడించింది. ఇద్దరూ ఓ ఇరుకు సందులోకి ఎంటరయ్యారు.

పదడుగులేసాక ఆమె తలెత్తి పైకి చూసింది. ఆమె అలా చూడడం గమనించిన రామకృష్ణ అడిగాడు ''లలితా! ఏంటలా చూస్తున్నావ్?''

''ఆకాశంలో మబ్బులు చూస్తుంటే వర్షం పడేలా ఉంది. త్వరగా ఇంటికి చేరుకుంటే బాగుణ్ను.''

అతడూ తలాడించాడు ''కాసింత వేగంగా నడుద్దాం''

పదడుగులేసేసరికి, తమది వృథా ప్రయత్నమే ననిపించింది వారిద్దరికీ. ''ఈ క్షణమో, మరో క్షణమో వర్షం పడేలా ఉంది'' చెప్పింది లలిత.

''అయితే మరో పని చేద్దాం... ఇటుగా వెళితే నా రూమ్

దగ్గరవుతుంది. అక్కడ కాసేపు కూర్చుని వర్షం తగ్గాక ఇంటికె ళ్లొచ్చు''

ఆమె అతడివైపోసారి అదోలా చూసింది. ఎందుకనో బిగించిన ఆమె పెదాల చాటు చిరునవ్వు దాగి ఉన్నట్టు తోచింది.

అతడికి ఆ నవ్వుకు అర్థం మాత్రం తెలియలేదు అతడికి ''పదండి'' అందామె.

ఇద్దరూ రూమ్‌వైపు అడుగులేస్తుండగా, మరి కాసేపట్లోనే వర్షం మొదలయింది. రూమ్‌కి చేరుకునే సరికి ఇద్దరూ తడిచి పోయారు.

అతడు గది తలుపు తీసి లోపలికెళ్లాక టవల్ ఆమెకు అందిస్తూ చెప్పాడు ''తల తుడుచుకో ముందు...''

ఆమె టవలే అందుకుంది. జుట్టుకు వేసి ఉన్న రబ్బర్ బేండ్ విప్పి విదిలిస్తే తడిసిన కురులు భుజాల చుట్టూ నీలిమేఘాల్లా పరుచుకున్నాయి. తలమీద పడ్డ వర్షం దారకట్టి, ముక్కు మీదకు జారి, పెదవులను ముద్దాడి, చుబుకాన్ని తాకి మెడ మీదుగా వక్షస్థలం లోనికి పారి అదృశ్యమయిపోతున్నాయి. తడిసిన శరీరం అద్దంలా కనిపిస్తోంది. ఒంటికి అంటుకున్న బట్టలు వంపుసొంపులు బట్ట బయలు చేస్తున్నాయి.

అతడి చూపులు ఆమె మీద నిలిచిపోయాయి. శరీరంలో ఎక్కడో మొదలయిన ప్రకంపన రక్తాన్ని వేగంగా పరిగెత్తేలా చేసింది.

ఆమె అనుకోకుండా తలెత్తి చూసింది. మన్మథ బాణాల్లా రక్త మంతా గడ్డ కట్టుకుపోయిన ఫీలింగే.

అతడు ఒకడుగు ముందుకేసాడు. ఆమె అప్రయత్నంగానే ఒక అడుగు వెనక్కేసింది. అతడు మరో రెండడుగులు ముందుకేసాడు. ఈసారి ఆమె వెనకడుగు వేయలేదు.

ఇద్దరూ ఎదురెదురుగా... ఇద్దరి మధ్యా దూరం కేవలం రెండడుగులు. అతడు చెయ్యి ముందుకు చాచాడు. ఆమె అతడి చేతివైపే చూస్తుంది. ఆ చెయ్యి ఆమె భుజం మీద వాలింది. అతడి చేతిలో నుండి విద్యుత్ పుట్టి తనువులోని రక్తాన్నంతా అమితవేగంతో పంపింగ్ చేస్తున్న అనుభూతి. ఆమెఅతడి కళ్లల్లోకి చూస్తూ మెల్లగా గొణిగింది. ''తప్పు... తప్పు... మనిద్దరికీ పెళ్లి కాకుండానే ఇలా ...''

అంత హాయిలోనూ నిండు మనసుతో నవ్వుకున్నాడు. పాపం! పిచ్చిది ఇప్పటికీ తను ఆమెను పెళ్లాడతానని నమ్ముతున్నట్టే ఉంది. తనకు మరదలంటే ఇష్టమనీ ఆమెనే పెళ్లాడబోతున్నానని ఈమెకు ఇప్పుడే చెప్పడం ఎందుకు?

అతడు చప్పున ఆమెను దగ్గరగా లాక్కున్నాడు. ఆక్షణం తనువుల మధ్య జరిగిన విస్ఫోటనం మనసుల్ని ఆలోచించకుండా చేసింది. అతడు తనేం చేస్తున్నాడో అర్థం కావడం లేదు... ముఖమంతా ముద్దుల వర్షం కురిపించాడా? పెదవులను ఎంగిలి చేసాడా?

మెడవంపులో తల దాచుకున్నాడా? లేక ఎదపొంగుల మెత్తదనం పరిక్షించాడా?...

అప్పటికే ఆమె నేలకు జారిపోయింది. ఆమె నుండి ఎటువంటి ప్రతిఘటనా లేకపోవడం అతడికి చాలా ఆనందాన్ని కలిగిస్తుంది.

తనువు.. తనువు రాపిడి మధ్య.. ఏదో.. ఏదో జరిగి.. సుఖాల తీరాలను చేరుకునే ఉండేవారే! కాని...

వర్షంతోపాటు గాలి బలంగా వీచసాగింది. బలమయిన ఆ గాలి విసురుకు కిటికీ ముందున్న టేబుల్ మీదున్న పుస్తకాలు చెదిరాయి. చెదిరిన పుస్తకాలలో నుండి ఓ ఫొటో ఎగురుతూ వచ్చి ఆమె తల వెనుక పడింది.

అందమైన ఓ ఆడపిల్ల ఫొటో!

ఆమె కన్నులలోకి చూస్తున్న అతడు, కళ్లెత్తి అటు చూసాడు... ఆ ఫొటోలోని అమ్మాయి తనను చూసే నవ్వుతోంది.

అతడిక మరేమీ చేయలేకపోయాడు. ఉధృతమైన ఆవేశం-వేగంగా వచ్చి ఒడ్డును తాకి వెనక్కు వెళ్లిపోయిన కెరటంలా! ఆమె ఫొటోను చూడడంతోనే చల్లారిపోయింది.

రామకృష్ణలో వచ్చిన మార్పును గమనించింది. ఆమె ''రామూ! .. ఏమిటి... నీకేమయింది?'' చల్లబడిన అతడి తనువు ఆమెను అనేక రకాలుగా ఆలోచించుకునేలా చేస్తుంది. కొంపదీసి తనది రాంగ్ సెలక్షన్ కాదు గదా?

అతడు ఆమె మీద నుండి పక్కకు వాలుతూ అడిగాడు ''లలితా! నువ్వు... నువ్వు కేవలం కోరికతో నన్ను చేరలేదు కదా?''

ఆమె విస్మయంగా అతడివైపు చూసింది ''కోరికతో ఏమిటి? ... మనిద్దరం పెళ్లి చేసుకోబోతున్నామన్న నమ్మకంతో...''

''నీ నమ్మకాన్ని వమ్ము చేసి నిన్ను మోసం చేయడం నాకిష్టం లేదు''

ఆమె అతడికేసి ఆశ్చర్యంగా చూసింది అతడు ఆమె ముఖంలోకి చూడడం లేదు. కిటికీలో నుండి కనిపించే వర్షం కేసి తదేకంగా చూస్తున్నాడు. అతడి పెదవుల్ను మాత్రం అప్రయత్నంగానే కదులుతున్నాయి. ''ఓ ఆడపిల్ల తన కుటుంబ ఆర్థిక పరిస్థితుల వలన తన పెళ్లి తనే చేసుకోవాలన్న నిజం తెలుసుకుంటే, ఆ మగాడు ఆ చనువుని అపార్థం చేసుకుని తనకు అవకాశంగా మలచుకోవడం మామూలే. నేనూ అలాంటి అవకాశవాదినే. కాని ఆఖరిక్షణం... నువ్వు నమ్మినా నమ్మకపోయినా ఓ ఆడపిల్ల ఫొటో నన్ను ఆ పని తప్పంటూ హెచ్చరించింది...''

ఆమె పెదవులు కంపిస్తుండగా అడిగింది ''ఎవరి ఫొటో?''

అప్పటివరకూ ఆమెకు కనిపించని వారి వెనుకే ఉంటే ఆ ఫొటోని అందుకుని ఆమెకు చూపిస్తూ చెప్పాడు.

''నాకు కాబోయే భార్య... నా మరదలు పార్వతి ఫొటో ఇది... ఇప్పుడే గాలి విసురుకి టేబుల్ మీద నుండి జారిపడింది.''

ఆ క్షణం ఆమె ముఖంలోని ఫీలింగ్స్ చూడలేక కాబోలు అతడు చూపులు మరల్చుకున్నాడు.

ఆక్షణం ఆమె బట్టలు సరిచేసుకుంది. అతడు ఆమెవైపు అప్పుడే చూపులు తిప్పాడు.

లలిత ముఖంలో చిరునవ్వు కదలాడుతుంది. మనసులో అగ్ని పర్వతమే బద్దలవుతూ ఉండొచ్చు, కాని ముఖంలో ఆ భావం కనిపించనివ్వకుండా చేయడం గొప్ప విషయమే.

ఆమె అదే నవ్వుతో అతడి ముఖంలో ముఖం పెట్టి చెప్పింది ''థాంక్స్'' లలిత వెళ్లిపోయింది.

☆☆☆

ఉదయమే మహేంద్ర ఊరు నుంచి వచ్చాడు.

మహేంద్ర రామకృష్ణకు పెదనాన్న కొడుకు. ఒకే ఊళ్లో హైస్కూల్ వరకూ కలిసి చదువుకున్నారు. స్కూల్ ఫైనల్ తర్వాత మహేంద్ర చదువు ఆపేసి పొలం పనులు చూసుకోవడం మొదలు పెట్టాడు. పంచాయితీకి సంబంధించిన విషయాలలో ఎప్పుడయినా సిటీకి వచ్చేవాడు. సిటీకి వస్తే రామకృష్ణ రూమ్‌లో ఉంటాడు.

రామకృష్ణ అతడిని ఆప్యాయంగా పలకరించి, ఊరి విశేషాలు అడగడం మొదలుపెట్టాడు. అయితే అతడు ఊరి విషయాలు చెపుతున్నా మరేదో విషయం చెప్పాలన్నట్టు అతడు ప్రతిక్షణం టాపిక్ డైవర్ట్ చేయబోతున్నాడు. మహేంద్ర ముఖంలోని మెరుపు, ఏదో చెప్పాలన్న అతడి తపన గమనించాక రామకృష్ణ అన్నాడు ''ఏమిట్రా మహీ! ఏదో హుషారుగా ఉన్నావ్?''

అతడు వెంటనే చెప్పాడు ''బస్సులో జరిగిన సంఘటన అలాంటిది మరి. అలాంటి సిట్యువేషనే నీకు ఎదురయి ఉంటే ఈసరికి రూమ్‌లో డాన్స్ చేసి ఉండేవాడివి''

''ఆహా! అంత ఆనందం కలిగించే సిట్యువేషనా? అయితే అది ఖచ్చితంగా ఆడపిల్లకు సంబంధించినదే అయి ఉంటుంది... కమాన్.. కమాన్.. టెల్‌మీ.. టెల్‌మీ...'' రామకృష్ణలోనూ క్యూరియాసిటీ మొదలయింది.

మరి కాసేపు బతిమలాడించుకుని అతడు చెప్పడం మొదలు పెట్టాడు. నేను మనూర్లో బస్సు ఎక్కానా- ఆమె పాటిపేట టౌన్‌లో బస్సెక్కింది. అటు ఇటూ చూసి మరే సీటు ఖాళీ లేకపోవడంతో నా పక్కనే కూర్చుంది. చాలా కలుపుగోలు మనిషి అనుకో... మొదట పలకరించింది నేనేనయినా ఆ తర్వాత ఆమె ఎక్కువ మాట్లాడింది. ఆమె ఇక్కడే జాబ్ చేస్తుందట. ఇంకా పెళ్లి కాలేదట. పాటిపేటలో తన పెదనాన్న ఇంటికెళ్లి వస్తుంది. ఆఫీసు అడ్రస్ చెప్పమని అడిగాను. ఊహూ!... చెప్పలేదు ఈరోజు సాయంత్రం బిర్లా మందిర్‌కే వస్తానంది...''

'ఈసారి వీడు సిటీలో కొద్దిరోజులు తిష్టవేస్తాడు' మనసులోనే అనుకున్నాడు రామకృష్ణ.

సాయంత్రం నేనూ రానా? ఆ అమ్మాయి ఎవరో, ఎలా ఉంటుందో చూడాలనిపించింది ఒకవేళ మహేంద్రది రాంగ్ సెలక్షన్ కాదు కదా!

''అమ్మో!... మొదటిరోజే మరొకరిని వెంట బెట్టుకుపోతే నా మీద ఇంప్రెషన్ పోదూ?'' నవ్వుకుని ఊరుకుండిపోయాడు రామకృష్ణ.

ఆ సాయంత్రం బిర్లా మందిర్‌కి వెళ్లి వచ్చాక మహేంద్ర మరింత హుషారుగా మరిన్ని కబుర్లు చెప్పాడు.

''ఆమె చాలా అందంగా ఉంటుందిరా. ఆమె పక్కనే కూర్చుంటే నాకు స్వర్గాన్ని అందుకున్నంత ఆనందంగా అనిపించింది. ఆమె భుజాలు రాసుకున్నప్పుడల్లా ఏదో తెలియని ఆనందం... రియల్లీ ఐ లైక్ హర్... ఐ లవ్ హర్... ఎవరెన్ని చెప్పినా నేను ఆమెనే పెళ్లాడుతాను...''

''ఒక్క రోజులోనే అతడిని పెళ్లి వరకూ తీసుకెళ్లగలిగిన అమ్మాయి ఎంత గొప్పదో కదా'' ఇంతకీ ఆమె పేరు?''

''లలిత''

అతడు ఈసారి మరికాస్త అనుమానంగా, భయంగా అడిగాడు ''ఆమె- ఆమె ఏ ఆఫీసులో పని చేస్తుందో తెలుసుకున్నావా?''

''తెలుసుకున్నాను..'' మహేంద్ర చెప్పాడు.

అంతే.. తూలిపోకుండా చాలా కష్టపడాల్సి వచ్చింది అతడికి.

☆ ☆ ☆

పెళ్లి కూతురుగా తన ఎదుట పడిన లలిత తనను చూసి ఇబ్బందిగా ఫీలవడం గమనించాడు రామకృష్ణ.

ఆమె పెళ్లిపందిరి వైపు నడవబోయే ముందు మేకప్ గదిలో మాట్లాడాడు.

''లలితా ఊహించని సంఘటనల సమ్మేళితమే జీవితం. అందులోనూ మారుతున్న సమాజంలో ఆడపిల్ల పెళ్లి కష్టమవుతున్న కాలంలో ఆమె ఒక అడుగు ముందుకేసి తన ప్రయత్నాలు తాను చేస్తోంది. ఇది తప్పా?... తప్పొప్పుల ప్రసక్తి పక్కన పెడితే ఆమెకు ఈ ప్రయత్నంలో కొన్ని ఎదురు దెబ్బలు తగలొచ్చు... బాధ పడాల్సిన అవసరం లేదు. బాధ జీవితమూ కాకూడదు.. జరిగిన దాన్ని మర్చిపో...''

ఆమె ముఖంలో నిజంగా పెళ్లి కళ కదలాడింది.

అయితే అతడి మనసులోని సంతృప్తి అంతకన్న ఎక్కువ! ఆడదాని అవసరాన్ని అవకాశంగా తీసుకోవాలని ముందడుగు వేసే మగాడు... ఆ ఆడది ఏదో బంధంతో తనకు మరోవిధంగా దగ్గరయితే?...

అతడు నిజంగా ఆనందించాడు.

## తెలివి ఒక్కరి సొమ్మంటే...

తెలివి తక్కువ దద్దమ్మా అని ఓ పాటే ఉంది ఏకంగా. బహుశా సిమ్రాన్‌కి ఆ విషయం తెలిసుండదు. లేకుంటే అలా చేసి ఉండదు అంటున్నారు అనుభవజ్ఞులు. ఓ తమిళ చిత్రంలో నటించడానికి 5 లక్షల ఎడ్వాన్స్ పుచ్చుకుని ఓ పాటలో నటించేశాక కాల్షీట్స్ ఇవ్వలేదిక సిమ్రాన్. ఆ పాత్రని తర్వాత 'రోజా' చేసింది. సిమ్రాన్ మాత్రం కాల్షీట్సే కాదు, ఇచ్చిన 5 లక్షల ఎడ్వాన్సూ ఇవ్వను పొమ్మంది. దాంతో ఆ నిర్మాత తన చిత్రంలో సిమ్రాన్ పాట స్పెషల్ ఎట్రాక్షన్ అని పబ్లిసిటీ మొదలెట్టాడు. అందుకే దాన్ని 'చిత్ర' పరిశ్రమ అన్నారు మరి.

